అందరూ దగాకోర్లేనా?

సెపువత్రి వెంకట సీతారామదాసు

"నమ్మి చెడినవారు లేరు, నమ్మక చెడిపోతే పొయ్యేరూ" అన్నాడు అంతవరకూ మౌనంగావున్న కృష్ణమూర్తి కొంచెం సాగుతున్న ధోరణిలో.

ఆరోజున వాన వదలకుండా కురవడం వల్ల మూడో శనివారం అయినా కృష్ణమూర్తి ఇంట్లో నేను, వేణు, శ్రీను, మోహన్ – మేమంతా సినీమా స్పెషల్ మ్యాటనీ కార్యక్రమానికి తిలోదకాలిచ్చి కబుర్లలోకి దిగాము.

కబుర్లంటూ ప్రారంభమైతే అవి ఏ విధముగా అంతం అవుతాయో పరిశీలిస్తే చిత్రంగా ఉంటుంది. అందులోనూ మా కృష్ణమూర్తిలాంటి తాత్కాలిక బ్రహ్మచారి (అంటే భార్యను పురిటికి పుట్టింటికి పంపించి వంటరిగా వండుకుంటున్నవాడు అన్నమాట) మిత్రబృందానికి వేరుశెనక్కాయలు, బటానీలు, తదితర మేత సరుకు సరఫరా చేస్తూవుంటే కబుర్లపాదు కాకరపాదు కాకమానదు.

మేము జాతీయ అంతర్జాతీయ సమస్యల్ని కూలంకషంగా కాకపోయినా మా శక్తికొలది చర్చించి విడిచిన తరువాత 'మానవస్వభావం' అనే అంశం మీదికి మా చర్చ మళ్లింది. 'మనిషిని నమ్మడమా నమ్మకపోవడమా' అనే సమస్య మీద మా దృష్టి కేంద్రీకృతం అయింది.

ఇక్కడ మా ఉద్యోగాలనుగురించి చెప్పడం అవసరమనుకుంటాను. కృష్ణమూర్తి ఎగ్జామినర్ ఆఫ్ లోకల్ ఫండ్ అకౌంట్సు ఆఫీసులో ఆడిటరు. మోహన్ మ్యాకెళ్ళ ఇనస్పెక్టరు. వేణు టిక్కెట్టు కలెక్టరు. శ్రీను బిల్లు కలెక్టరు. నేను ఈ జన్మలో కలెక్టరును కాను గాని ఎప్పటికైనా ఏమైనా కాగల ఎప్పటకీ ఏమీ కాకుండా ఉండిపోగల గుమాస్తాను. (నా పేరు శంకరం.) మేమందరం సనత్ నగర్ కాలనీలో ఉండడం వల్ల మా మధ్య చనువు ఏర్పడింది. వేణు మాత్రం బెజవాడలో వున్నాడు. పనిమీద హైదరాబాదు అప్పుడప్పుడు వచ్చినప్పుడు కృష్ణమూర్తికి బంధువు కాబట్టి వాళ్ళ ఇంట్లో దిగుతాడు.

'ఏ దెబ్బ తిన్నా మనిషిని నమ్మడానికి సిగ్గు' అనే సూత్రం క్రింద మా అనుభవాలను ఏకరువు పెట్టాము.

ఉదాహరణలతో వచ్చిన చిక్కేమిటంటే మన వాదనకు పనికివచ్చినవాటనే ఎన్నుకుంటాము. మన వాదాన్ని త్రోసిరాజనేవి ఎన్నివున్నా మన కంటికి ఆనవు.

అంతవరకూ మా అనుభవాల్ని ఓపికగా వింటూ కాఫీ కుంపటికి గాలి విసురుతున్న కృష్ణమూర్తి "నమ్మి చెడినవారు లేరు, నమ్మక చెడిపోతే పొయ్యారూ" అని మళ్లీ మూనిరాగం తీశాడు.

కృష్ణమూర్తి ఎవరైనా కబుర్లు చెబితే వినేవాడే కాని స్వతహాగా కబుర్ల ధోరణిలోనివాడు కాడు. వాడు స్వంతం అభిప్రాయం వెలిబుచ్చడం అంటె మాకు కొంచెం చిరాకు వేసింది.

"వట్టినే స్వీకరించడం ఒప్పుకోము" అన్నాడు వేణు.

"నీ అనుభవం ఏదైనా చెప్పాలి చేవవుంటే" అన్నాడు శ్రీను.

"చెప్పకేం, చెబుతాను. కుంపటికి గాలి విసిరే బాధ్యత ఎవరైనా తీసుకోండి" అన్నాడు కృష్ణమూర్తి.

మా మిత్రబృందం వుంది చూశారూ, అది కబుర్లలో చూపగలిగినంత వడి ఏదైనా పని చేయాలంటే మందకొడిగా తయారవుతుంది. ప్రపంచ బద్ధకస్తులలో ప్రథమ బహుమానం ఇవ్వాలంటే మా నలుగురిలో ఎవరికి ఇద్దామా అని జడ్జీలు తికమక పడవలసిందే. ఇంతకూ కుంపటికి గాలి ఎవరు విసరాలనేది తేలక దానిని గాలివచ్చే వైపుకు పెట్టేద్దాం అని ఏకగ్రీవంగా అంగీకరించాము.

"ఇప్పుడు నేను చెప్పబోయే అనుభవానికి సాక్షి మనలో ఒకరున్నారు." అన్నాడు కృష్ణమూర్తి.

ఆ సాక్షి ఎవడైవుంటాడా అనే జిజ్ఞాస మమ్మల్ని కొంతసేపు పీడించింది.

"మమ్మల్ని చంపక ఆ సాక్షి ఎవరో చెప్పేద్దూ" అని బతిమాలాడు మోహన్.

"చెబుతూవుంటే మీకే తెలుస్తుంది, వినండి.

"రెండు సంవత్సరాల క్రితం ఒకనాడు రాజమండ్రీమ్యునిసిపాలిటీ లెక్కలు తనిఖీ

పూర్తిచేసుకుని హైదరాబాదు తిరిగి వస్తున్నాను, ఫుల్ ప్యాసెంజరులో

"నేను కూర్చున్న కంపార్టుమెంటులో జనం క్రిక్కిరిసి ఉన్నారు."

"నువ్వు కూర్చున్న రైలుపెట్టెలోని జనం వివరాలతో మమ్మల్ని చంపకు. రైలుపెట్టెలన్నీ ఇంచుమించు ఒకేవిధముగ వుంటాయి" అన్నాడు వేణు.

"సరేలేవయ్యా...ఇక వినండి. సాయంకాలం ఆరుగంటలకు రైలు బండి తాడేపల్లిగూడెం స్టేషనుకు వచ్చేసరికి టిక్కెట్టు కలెక్టరు వేణు మా పెట్టెలోకి వచ్చి తనిఖీ ప్రారంభించాడు. ముందు బల్లల క్రింద దూరిన ముష్టివాళ్ళని దింపేశాడు.

కిటికీలోంచి ప్రకృతిపరిశీలన చేస్తున్న ఇరవైయేళ్ళ యువకుడి భుజం మీద చెయ్యివేసి 'టికెట్. ప్లీజ్' అన్నాడు టికెట్ కలెక్టర్ వేణు.

అతని మొగము వెలవెలపోయింది. 'అరెరె, నా పర్సు పోయింది సార్, టిక్కెట్టుతో సహా డబ్బు కూడా పోయిందండీ' అని ఏడుపు కంఠంతో కేకేశాడు.

"కాని, అతడ్ని టిక్కెట్టు కలెక్టరు వేణు నమ్మలేదు."

"అవును. నేనునమ్మలేదు. అదంతా దొంగ వేషమని నాగట్టి అభిప్రాయము." అన్నాడు వేణు.

"సరేలే. నీ అభిప్రాయం నీది. నన్ను చెప్పనియ్యి టిక్కెట్టు కలెక్టరు వేణు వాలేగనుంచీ టిక్కెట్టు ఎక్సెస్ ఫేర్‌తో సహా కట్టుకోవాలన్నాడు. లేకపోతే రైల్వే మాజిస్ట్రేటు దగ్గరకు వెళ్ళవలసి ఉంటుందన్నాడు.

"ఆ యువకుడు బ్రతిమాలాడు.

'నాదగ్గర డబ్బు లేదు, నన్ను విడిచి పెట్టండి సార్. వుద్యోగానికి ఇంటర్వ్యూకోసమని హైదరాబాదు వెళ్లుతున్నాను, సార్! ఇప్పుడు నేను హైదరాబాదుకు వెళ్లకపోతే నాకు ఉద్యోగం దొరకదండి. మాజిస్ట్రేటుగారు నాకు శిక్ష విధిస్తే ఇక ఎప్పుడూ ఉద్యోగం దొరకదు. నా బ్రతుకు నాశనం చేయకండి బాబూ, నన్ను విడిచి పెట్టి పుణ్యం కట్టుకోండి సార్!'

"ఆ యువకుడి మాటలు వింటే నాగుండె కరిగింది. కాని టిక్కెట్టు కలెక్టరు వేణుది రాతి గుండె."

"టిక్కెట్టులేని వెధవలంతా ఇలాంటి కట్టుకథలే చెబుతారు. అవన్నీ నమ్మడానికి వీల్లేదు" అని తన చర్యను సమర్థించుకున్నాడు వేణు.

"నిజమేనయ్యా స్వామీ. మూర్తిని పూర్తి చెయ్యనియ్యి" అని బ్రతిమాలాడు శ్రీను.

"ఆరోజున నేను జోక్యం కలిగించుకొని 'పోనీ వేణూ—' అని చెప్పబోయాను. లేదో 'నువ్వేమీ నా వృత్తిధర్మ నిర్వహణలో జోక్యం కలిగించుకోవద్దు' అని ఖండితంగా చెప్పాడు.

'అది కాదయ్యా. నీ వృత్తి ధర్మం భేషుగ్గా నిర్వహించు. ఈ పెట్టెతప్ప మిగతా పెట్టెలన్నీ కూలంకషంగా తనిఖీ చేసేయ్...'

"పెట్టెలోని వారంతా గొల్లున నవ్వారు.

"వేళాకోళానికి కూడా సమయం వుంది" అని విసుక్కున్నాడు వేణు.

"'వేళాకోళం కాదు. ఆ అబ్బాయి కట్టవలసిన డబ్బు నేను చెల్లిస్తాను. రసీదు వ్రాసిఇయ్యి' అన్నాను.

"'నీకంత డబ్బు ముఱిగిపోతూ ఉంటే ఇయ్యి. నీకర్మకు నేనేం చేస్తాను' అని డబ్బు తీసుకుని రసీదు వ్రాసి ఆ అబ్బాయి చేతిలో పెట్టి వేరే పెట్టెలోకి పోయాడు వేణు.

"ఆ యువకుడు కృతజ్ఞతా భారంతో క్రుంగిపోతూ నాకు నమస్కారం చేశాడు.

"అనుభవాల పేరుతో సొంత డబ్బా వాయించుకోడానికి ఈ సభ అంగీకరించదు" అని నేను అభ్యంతరాన్ని తెలిపాను.

"పోనీవోయ్, శంకరం కొంత డబ్బు ఖర్చు పెట్టాడు కనుక కొంచెం వాయించుకో నిద్దాం." అన్నాడు శ్రీను

"అయిపోయిందా నీ అనుభవం?" అనిఅడిగాడు మోహన్

"మీ అసాధ్యం కూలా. నన్ను చెప్పనియ్యరేం?" అన్నాడు కృష్ణమూర్తి.

"చెప్పు బాబూ, చెప్పు" అని మేము వింటున్నాము.

"ఆ యువకుడు నాకు చాలా 'థాంక్స్' చెప్పి 'దయచేసి పెట్టె చూడండి సార్! ఇప్పుడే మంచి నీళ్లు త్రాగివస్తాను' అని ప్లాటుఫారం మీదికి వెళ్లాడు.

"ఇంతలో రైలు కదిలింది. అతడు వస్తున్నాడో లేదోనని ఆత్రంగా కిటికీలోంచి చూశాను. పరుగెత్తుకుంటూ వచ్చి చివరి పెట్టెలో ఎక్కాడు.

"అతడు ఏలూరు స్టేషనులో కాని పవరుపేట స్టేషనులో కాని నేనున్న పెట్టెలోకి రాలేదు. క్రిందికి దిగి అన్ని పెట్టెలూ వెదకుదామని మొదట అనుకున్నాను కాని మా ట్రంకుపెట్టెలు ఎవరైనా కొట్టేస్తారేమోనని ఆ ప్రయత్నం విరమించుకొన్నాను.

"రైలుబండి బెజవాడ చేరేసరికి రాత్రి ఎనిమిదింపావు అయింది. అతడు బెజవాడ స్టేషనులో నా కంపార్టుమెంటుకి వచ్చాడు. అతనికేసి ప్రశ్నార్థకంగా చూశాను.

"'నా పర్సు కొట్టేసిన వెధవ దొరుకుతాడేమోనని వెతుకుతున్నాను సార్!' అని సమాధానం చెప్పుకున్నాడు.

"వాడిని మీరు చూడందే ఎలా పోల్చ గలరు?" అని అడిగాను.

" 'వాడు ఇంకొకరి పర్సు కొట్టేయడానికి ఎలానూ ప్రయత్నం చేస్తాడు. అప్పుడు నేను వాడిని పట్టుకుంటాను' అన్నాడు.

"నాకు నవ్వు వచ్చింది.

" 'మీరెంత అమాయకులండీ! మీ పర్సు కొట్టేసినవాడు ఒక్కడే కాకపోవచ్చును. ఒక గ్యాంగు కావచ్చును. వాళ్లు మీ పర్సు కొట్టేసిన తరువాత ఈ రోజుకి 'పని' చాలించుకోవచ్చును' అన్నాను.

" 'మీరు చెప్పింది కూడా సంభవమే కావచ్చును. కాని వాళ్ళు ఇంకా వాళ్ల

అంతా దగాకోర్లేనా?

కార్యక్రమం కొనసాగించవచ్చుననుకోడానికి కూడా వీలుంది' అన్నాడు.

" 'నిజమే'నని అంగీకరించాను.

"క్యారేజితో భోజనం తెప్పించుకున్నాను. అతడికి కూడా పెట్టాను. అతడు సిగ్గుపడుతూ తిన్నాడు.

" 'మీరు అదునులో అన్నం పెట్టారు. లేకపోతే నాకీ పూట ఏకాదశే' అన్నాడు.

"నాకు చాల జాలి వేసింది.

"భోజనం అయిన తరువాత ఇప్పుడే వస్తానండి' అంటూ అతడు బయటకు వెళ్లాడు.

"మా బండి బెజవాడ విడిచేటప్పటికి రాత్రి పది గంటలయింది ఆ యువకుడు నా కంపార్టుమెంటుకి రాలేదు.

"మా బండి డోర్నకల్లు స్టేషన్ రావడం నాకు తెలియలేదు. అప్పటికే నాకు నిద్ర గాఢంగా పట్టింది.

"తెల్లవారుతోందనగా మెళకువవచ్చింది. బండి ఆగివుంది. బయటికి చూసేటప్పటికి కాజీపేటస్టేషనుకు వచ్చామని తెలిసింది ఏ గుడ్సుబండికోసమని ఎక్కడ నిలిపేశారో యేమో తెల్లవారుఝామున నాలుగుగంటలకు రావలసిన బండి ఆరు గంటలకు కాజీపేట చేరింది.

"మా ట్రంకుపెట్టె లున్నాయో లేదో చూశాను. నా పెట్టె పోలేదు. ఆ యువకుడి పెట్టె కనపడలేదు. తీసుకుని ఇంకొక పెట్టె లోకి వెళి వుంటాడనుకున్నాను. తలగడ క్రిందనున్న కోటుతీసి పర్సుచూసుకున్నాను మూడు పదిరూపాయల నోట్లు ఉండవలసిన చోట ఒకటే పదిరూపాయల నోటుంది. ఇరవై రూపాయలు కనపడడంలేదు."

"దొంగవెధవ ఆయువకుడే తీసి వుండాలి" అన్నాడు వేణు.

"మరి డబ్బంతా తీయలేదే" అన్నాడు కృష్ణమూర్తి.

"అందుచేతనే వాడే తీశాడనుకుంటాను" అన్నాడు మోహన్.

ఇంతలో వంటింటిలో కుంపటిమీది నీళ్లు పొంగి పొయిలోపడ్డ శబ్దం వినిపించింది.

"కాఫీ పొడి వేసి వస్తాను" అని కృష్ణమూర్తి వంటింట్లోకి వెళ్లాడు.

"ఆ దొంగవెధవ కబుర్లునమ్మి టిక్కెట్టు కొనిపెట్టి అన్నంకూడా పెట్టినందుకు మంచి శాస్తి చేశాడులే" అన్నాడు వేణు

"మన కృష్ణమూర్తిది జాలి గుండె. మనుష్యుల్ని ఇట్టేనమ్మేస్తాడు, పాపం" అన్నాడు శ్రీను.

కృష్ణమూర్తి కాఫీకప్పు లన్నీ ఒక 'ట్రే'లో పెట్టి మా ముందుంచాడు.

"యాభై రూపాయలు వదుల్చుకున్న నీ అనుభవం పూర్తయిందా మూర్తీ" అని హేళనగా 'తగిన శాస్తి జరిగింది' అన్నట్లు అడిగాడు మోహన్. మానవుని నిజాయితీలో నమ్మకం నశించిన మాకు కూడా కృష్ణమూర్తి పడిన దగాకు విచారం బదులు కొంత తృప్తి కలిగింది.

"పదిహేను రోజుల క్రితంవరకూ పూర్తయిందనే అనుకున్నాను."

"ఏం జరిగిందేమిటి?"

"మళ్లీ వాడు కనిపించాడా?" అని మేముందరం ఒకేసారి అడిగాము.

బయట వాన వెలిసింది

"కనిపించలేదు. కాని ఉత్తరం వ్రాశాడు" అని ఇంటిలోకి వెళ్లి పెట్టెలోంచి ఒక ఉత్తరంతీసి శ్రీను చేతికిచ్చాడు కృష్ణమూర్తి. శ్రీను ఈ విధముగా చదివాడు —

వరంగల్లు
2-8-60

"ఆపదలో ఆదుకున్న కృష్ణమూర్తి గారికి అనేక నమస్కారాలుచేసి రామం వ్రాసే విన్నపములు:

మీరు ఆరోజున నాకు చాలా ఉపకారం చేశారు. నేను ఎన్నటికీ మరువలేను. వరంగల్లు స్టేషనులో ఎక్స్‌ప్రెస్ క్రాసు చేస్తుందని తెలిసి త్వరగా వెళ్లాలనే తలంపుతో నా పెట్టె తీసుకునిపోయాను. మీరు గాఢంగా నిద్రపోతున్నారు. మిమ్మల్ని లేపడం నాకిష్టం లేకపోయింది. నాకు హైదరాబాదులో ఎవరూ తెలిసినవారు లేరు. ఎవరు నాకు డబ్బిస్తారు? మీరు దయాస్వరూపులు మిమ్మల్ని లేపి అడిగితే మీరు ఇస్తారనే సంపూర్ణ విశ్వాసం నాకుంది. ఇక మీ నిద్ర పాడుచేయడం దేనికని మీ పర్సులోంచి నాకు కావలసిన ఇరవై రూపాయలూ తీసుకున్నాను. దొంగతనం చేశానని నేను అనుకోవడంలేదు. ఎప్పటికైనాసరే మీ డబ్బు (టిక్కెట్టుకిచ్చిన దానితో సహా) మీకు పంపించాలనే ఉద్దేశ్యం నాకుంది. అందుచేతనే మీ చిరునామా ఉన్న కార్డుకూడా మీ పర్సులోంచి తీశాను.

మీరు సహృదయంతో కొని యిచ్చిన టిక్కెట్టువల్ల క్షేమంగా హైదరాబాదు చేరాను. నాకు ఉద్యోగం దొరికింది. ఆ కంపెనీ వరంగల్లు బ్రాంచిలో వేశారు. ఇప్పుడు వరంగల్లులో ఉంటున్నాను. సంవత్సరంన్నరనుంచీ మీ డబ్బు పంపించాలనే ప్రయత్నిస్తున్నాను. డబ్బు పంపనిదే ఉత్తరం వ్రాయడానికి సిగ్గుపడ్డాను. క్షమించండి ఈ రోజునే మీ ఇంటి అడ్రసుకి యాభై రూపాయలు పంపిస్తున్నాను. మీ అప్పు డబ్బురూపంలోవున్నది తీర్చగలిగాను కాని మీరు చూపిన దయ అమూల్యమైనది ఆ అప్పు తీర్చడానికి వీలులేనిది.

హైద్రాబాదు వచ్చినప్పుడు తమ దర్శనం చేసుకుంటాను.

చిత్తగించవలెను
రామం."

ఉత్తరం చదవడం పూర్తిచేసి "అయితే మనియార్డరు అందిందా" అని అడిగాడు శ్రీను

"ఇంకా అందలేదు" అన్నాడు కృష్ణమూర్తి.

"కాచుకుని కూర్చో అందుతుంది!" అన్నాడు హేళనగా వేణు.

"వాడు నిన్ను ఇంకా మోసం చేయాలని చూస్తున్నాడు. జాగ్రత్త బాబూ, జాగ్రత్త" అన్నాడు మోహన్.

ఇంతలో పోస్టుమాన్ వచ్చాడు.

"కృష్ణమూర్తికి మనియార్డరు కాదుకద!" అని హేళనగా అడిగాడు వేణు

"మనియార్డరేనండి, వరంగల్లునుంచి యాభైరూపాయలు వచ్చింది. ఎవరో జి. రామం అనే ఆయన కట్టారు," అని ఏకరువు పెట్టాడు పోస్టుమాన్.

అందరం ఆశ్చర్యపడ్డాం.

"నమ్మి చెడినవాడూ లేడూ" అని పాడుకుంటూ కలంకోసం గదిలోకి వెళ్లాడు కృష్ణమూర్తి. ★